క్లుప్తంగా

సాఫ్ట్‌బాల్‌లో విద్యార్థిని ప్రతిభ



క్రోసూరు: స్థానిక సెయింట్ ఆన్స్ ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థిని సీనియర్ సాఫ్ట్ బాల్ పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ మేరీ రజిత శనివారం తెలిపారు. వట్టిచెరుకూరు మండలం పల్లపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆట స్థలంలో 10వ రాష్ట్ర స్థాయి సీనియర్ సాఫ్ట్ బాల్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్ జరిగింది. ఈ టోర్నమెంటులో 8వ తరగతి విద్యార్థిని కె.తిరుమల ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపల్ చెప్పారు. విద్యార్థినిని ప్రిన్సిపల్‌తో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు మక్కెన వెంకట్రావు, ఉపాధ్యాయులు బురాన్, విజయ్, పద్మ, దానియల్ అభినందించారు.

నేడు కొండూరులో 'మన కోసం - మన శంకరన్న'

అచ్చంపేట: ప్రజా సమస్యల పరిష్కారానికి కొండూరు గ్రామంలో ఆదివారం ఉదయం 10 గంటలకు మన కోసం – మన శంకరన్న కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.శివ సుబ్రమణ్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొని, పలు సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు. గడప గడపకు కార్యక్రమంలో వచ్చిన సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు.

ఈ- క్రాప్ నమోదు చేసుకోవాలి



నకరికల్లు: ఈ నెల 30వ తేదీలోగా ఈ-క్రాప్, ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు తెలిపారు. చేజర్ల గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూరియా, డీఏపీ, ఎరువుల నిల్వలు తనిఖీ చేశారు. ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్న 895 మంది రైతులు ఆర్బీకే సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

భర్తతో గొడవపడి భార్య ఆత్మహత్య

నరసరావుపేట టౌన్: భర్తతో వివాదం కారణంగా భార్య గడ్డి మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని శనివారం కాకాని గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామీణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. కాకాని గ్రామానికి చెందిన మేడంపల్లి శ్రీదేవి (41) భర్త శేషగిరికి మధ్య గత కొన్ని రోజులుగా వివాదం కొనసాగుతుంది. ఈ క్రమంలో మనస్తాపం చెందిన ఆమె గడ్డి మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాధితురాలిని కుటుంబ సభ్యులు పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు రూరల్ ఎస్ఐ శివనాగిరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

నరసరావుపేట టౌన్: ద్విచక్ర వాహనం ఇప్పించ లేదని యువకుడు ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన శనివారం పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. పాతూరు ప్రాంతానికి చెందిన ఆవుల వెంకట శివసాయి ద్విచక్రవాహనం ఇప్పించాలని తండ్రితో గొడవ పడ్డాడు. వాహనం ఇప్పించక పోవటంతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు కొన ఊపిరితో ఉన్న వెంకట శివసాయిను వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరేంద్ర బాబు తెలిపారు.

బీఫార్మసీ విద్యార్థి బలవన్మరణం

నాదెండ్ల: దుర్వ్యసనాలు, బెట్టింగులకు బానిసైన విద్యార్థి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం తూబాడు గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు పోలీసులకు యిచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై జె.బలరామిరెడ్డి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తూబాడు గ్రామానికి చెందిన దోగిపర్తి వెంకటేశ్వర్లు దంపతులకు ముగ్గురు సంతానం. పెద్దకుమార్తెకు వివాహం కాగా మొదటి కుమారుడు నరేంద్రబాబు ఇంట్లోనే చిల్లర దుకాణం నడుపుతాడు. రెండో కుమారుడు ధనుష్‌కుమార్ (20) నరసరావుపేటలోని ఓ కళాశాలలో బీఫార్మసీ ఫైనలియర్ చదువుతున్నాడు. ధనుష్ కుమార్ తన మిత్రులతో కలిసి పలువురి వద్ద అప్పులు తీసుకున్నాడు. రెండేళ్ళ నుంచి అప్పులు ఇచ్చిన వారికి అధిక వడ్డీలు చెల్లిస్తూ వచ్చాడు. ఈ క్రమంలో రెండు నెలల నుంచి వడ్డీలు చెల్లించకపోవటంతో అప్పులిచ్చిన వారు ఇంటికి వచ్చి తల్లిదండ్రులను నిలదీశారు. దీంతో మనస్తాపానికి గురైన ధనుష్‌కుమార్ శుక్రవారం ఉదయం పురుగు మందుతాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు నరసరావుపేట ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం ధనుష్‌కుమార్ మృతి చెందాడు. తండ్రి దోగిపర్తి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని ఆదివారం బంధువులకు అప్పగించనున్నారు.

మహిళకు మకుటం

- చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్
- మహిళా బిల్లుపై సర్వత్రా హర్షం
- బిల్లును స్వాగతిస్తున్న అన్ని వర్గాలు
- సత్తెనపల్లి నియోజకవర్గంలో మహిళా ఓటర్లే అధికం
- మహిళా ప్రజాప్రతినిధులకు ప్రభుత్వం పెద్దపీట



సత్తెనపల్లి: దశాబ్దాల కల సాకారమైంది. చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడంపై ఉభయ సభల్లో మద్దతు లభించింది. త్వరలోనే బిల్లు కార్యరూపం దాల్చనుంది. దీంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఢిల్లీలోని నూతన పార్లమెంట్ భవనంలో తొలి బిల్లుగా మహిళా బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించడం సరికొత్త చరిత్రకు నాంది పలికిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మెజార్టీ రాష్ట్రాల ఆమోదం తర్వాత బిల్లుకు రాష్ట్రపతి ఆమోద ముద్ర వేయనున్నారు. దీంతో మహిళా బిల్లు దేశంలో చట్టంగా రూపుదిద్దుకోనుంది. 27 ఏళ్లుగా మహిళా బిల్లును ఆమోదించే విషయంలో పాలకులు మల్లగుల్లాలు పడుతూ వచ్చారు. ఇన్నేళ్లకు మహిళా బిల్లుకు ఆమోదం లభించడంపై వివిధ వర్గాల మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో ఆమెదే పైచేయి

సత్తెనపల్లి నియోజకవర్గంలో మహిళా ఓటర్లదే పైచేయి. 2,33,078 మంది ఓటర్లు ఉంటే వీరిలో పురుషులు 1,14,370 మంది ఉండగా మహిళలు 1,18,691 మంది, ఇతరులు 17 మంది ఉన్నారు. పరుషులు కంటే 4,321 మంది మహిళలు అధికంగా ఉన్నారు. పట్టణంలో 31 వార్డులకు గాను మహిళా కౌన్సిలర్లు సగాని కంటే ఎక్కువ 17 మంది ఉన్నారు. కో-ఆప్షన్ సభ్యులు ముగ్గురిలో ఇద్దరు మహిళలు ఉండటం గమనార్హం. నియోజకవర్గంలోని 73 పంచాయతీలకు గాను 40 మంది మహిళా సర్పంచ్‌లు గ్రామాలను పరిపాలిస్తున్నారు. 64 మంది ఎంపీటీసీ సభ్యుల్లో 38 మంది మహిళలే ఉన్నారు. సత్తెనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసీ, సత్తెనపల్లి ఎంపీపీ షేక్ ఎలవర్తిపాటి జైబున్నీసా, జెడ్పీటీసీ సంకటి నాగేశ్వరమ్మ, ముప్పాళ్ళ ఎంపీపీ మారూరి పద్మ, జెడ్పీటీసీ శిరిగిరి చంద్రకళ, రాజుపాలెం ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరీ, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీతలక్ష్మి, నకరికల్లు ఎంపీపీగా మేచారపు అనురాధ పాలన పగ్గాలు చేపట్టి, అభివృద్ధి పథంలో ముందుకు పోతున్నారు.

నియోజకవర్గంలో మహిళా ప్రజాప్రతినిధులు

మండలం	సర్పంచ్‌లు	మహిళలు	ఎంపీటీసీలు	మహిళలు
సత్తెనపల్లి	25	14	21	15
ముప్పాళ్ళ	14	07	12	07
రాజుపాలెం	17	10	13	07
నకరికల్లు	17	09	18	09
మొత్తం	73	40	64	38

ఆత్మగౌరవం పెరిగింది



చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లు ఆమోదం పొందడం ద్వారా మహిళల్లో ఆత్మగౌరవం పెరిగింది. ఒక మహిళా ప్రజా ప్రతినిధిగా ఇది మహిళా విజయంగా భావిస్తున్నాను. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి సంక్షేమ పథకాన్ని మహిళల పేరిట అమలు చేస్తూ మహిళా పక్షపాతిగా ఖ్యాతి గడించారు.

–చల్లంచర్ల లక్ష్మీతులసీ, మున్సిపల్ ఛైర్‌పర్సన్, సత్తెనపల్లి

సమానత్వానికి స్వాగతం



స్త్రీలు, పురుషులు అన్న తేడా లేకుండా సమానత్వానికి నాంది పలుకుతూ 33 శాతం మహిళా రిజర్వేషన్లు కల్పించిన ప్రభుత్వానికి, అందుకు సహకరించిన రాష్ట్రాలకు ధన్యవాదాలు. దేశ రాజకీయాలల్లో మహిళలు మరింతగా రాణించి, దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించనున్నారు. ఇది దేశానికే గర్వకారణం.

–షేక్ ఎలవర్తిపాటి జైబున్నీసా, ఎంపీపీ, సత్తెనపల్లి

ఇది చరిత్రాత్మకం



కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మహిళా బిల్లు చరిత్రాత్మకం, అందరికీ గర్వ కారణం. 2029 నుంచి చట్టసభల్లో మహిళలు మూడొంతుల మంది ఉండనుండటం గొప్ప విషయం. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నామినేటెడ్ పదవుల్లో మహిళలకు 50 శాతం కేటాయించడం ద్వారా సరికొత్త చరిత్ర సృష్టించారు.

–సంకటి నాగేశ్వరమ్మ, జెడ్పీటీసీ, సత్తెనపల్లి

కర్లపూడి పాఠశాలలో వాటర్ ప్లాంట్ ప్రారంభం



అమరావతి: కర్లపూడి ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను శనివారం ఎంపీడీఓ పి. ఉమాదేవి ప్రారంభించారు. కొయ్యలమూడి బాలశౌరి, చిన మరియమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు కేసీహెచ్ బాల స్వామి సుమారు రూ.40వేల వ్యయంతో ఈ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. తొలుత రెవరెండ్ ఫాదర్ రాజసుధీర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఎం.శ్రీనివాసరావు, ప్రధానో పాధ్యాయుడు వి.పూర్ణసుధాకరరావు, విద్యా కమిటీ ఛైర్మన్ పి.నాగేంద్రబాబు, బి.ఝాన్సీరాణి, కె.సుశీల పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిసలు కావద్దు

చిలకలూరిపేటటౌన్: యువత వ్యసనాలకు బానిసై తమ భావిజీవితాన్ని నాశనం చేసుకోవద్దని డాక్టర్ సయ్యద్ అహమ్మద్ బాష చెప్పారు. ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని వాసవి గ్రాండ్ పంక్షన్ హాలులో సేవ్‌ది యూత్– సేవ్‌ది ఫ్యూచర్ అనే అంశంపై విద్యార్థులకు సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ అహమ్మద్ బాష మాట్లాడుతూ సోషల్ మీడియాతో విద్యార్థులు ఎక్కువ సమయం గడుపుతున్నారని తెలిపారు.

అన్ని గ్రామాల అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- హసనాబాద్, నాగవరంలో 'మన కోసం- మన శంకరన్న'



నాగవరం సభలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నంబూరు

క్రోసూరు: పెదకూరపాడు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేయటమే లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నానని, అభివృద్ధి చూసి ఓట్లతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, తనను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు గ్రామస్తులను కోరారు. శనివారం మండలంలోని హసనాబాద్, నాగవరం గ్రామాల్లో మన కోసం – మన శంకరన్న కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తెలిపిన సమస్యలు పరిష్కారంపై అధికారులు, ప్రజలతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. సమావేశానికి ఎంపీపీ పి.కోటయ్య అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ హసానాబాద్‌లో అభివృద్ధికి రూ.3.58 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. సంక్షేమానికి రూ.7.18 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. నాడు – నేడు ద్వారా పాఠశాలలకు రూ.1.77 కోట్లు, జలజీవన్ మిషన్ ద్వారా ఇంటంటికి కుళాయి కనెక్షన్‌కు రూ.90 లక్షలు ఖర్చుచేసినట్లు వివరించారు. దొడ్లేరులో అదనపు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నిర్మిస్తున్నామని, అందుకు వైద్యులను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. నాగవరం గ్రామంలో సంక్షేమ పథకాల రూపంలో రూ.10.75 కోట్లు లబ్ధి ప్రజలకు చేకూరిందని ఎమ్మెల్యే చెప్పారు. రూ.3.48 కోట్లు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. నాడు – నేడు ద్వారా రూ.82 లక్షలతో పాఠశాలల రూపురేఖలు మార్చినట్లు వివరించారు. సీసీరోడ్లు, సురక్షిత తాగునీటి కోసం రూ.1.30 కోట్లు ఖర్చుపెట్టామన్నారు. నాగవరంలో పింఛన్లు గతంలో 251 ఉండేవని ప్రస్తుతం 426 మంది లబ్ధి పొందుతున్నట్లు తెలిపారు. టీడీపీ పాలనలో దళారీ వ్యవస్థ లంచాలు తీసుకొని ప్రజల్ని వంచిందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నయా పైసా అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలోనే సంక్షేమఫలాలు చేరుతున్నాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే ఇంతటి సంక్షేమం, అభివృద్ధి చేయగలరని ప్రజలు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు జియావుల్ హక్, ఎంపీడీఓ బి.మహేష్, ఈఓపీఆర్డీ సీతారామయ్య, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, జెడ్పీటీసీ షేక్ జమీలాగపూర్, పాశం శ్రీనివాసరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు అనుమలకోటిరెడ్డి, సయ్యద్ అబ్దుల్ రహీం, నాగవరం పార్టీ నాయకులు వి.దేవదానం, హసానాబాద్ గ్రామ సర్పంచ్ రహీమాన్, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత

మాదల(ముప్పాళ్ళ): గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సత్తెనపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ టి.శ్రీలత అన్నారు. మాదల గ్రామంలో మండలస్థాయి పోషణ మాసోత్సవం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ పాల్గొని, చిరుధాన్యాల ప్రాముఖ్యతను, ఆకు కూరల లాభాలు, బాల్య వివాహాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. వైఎస్సార్ ప్రీ ప్రైమరీ సిలబస్ పుస్తకాలను చిన్నారులకు అందించారు. తహసీల్దారు ఎం.భవానిశంకర్, ఎంపీడీవో పి.పుల్లారెడ్డి, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, గర్భిణీలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

- చేసినా.. ప్రోత్సహించినా జైలు, జరిమానా తప్పదు
- బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి
- యడ్లపాడు-2 గ్రామ సచివాలయం సందర్శన



సచివాలయం సిబ్బందితో మాట్లాడుతున్న పద్మావతి, ఎంపీడీవో వై.హనుమారెడ్డి

యడ్లపాడు: బాల్యవివాహాలు చేసినా, ప్రోత్సహించినా.. జైలుశిక్ష, జరిమానా తప్పదని బాలల హక్కుల కమిటీ సభ్యురాలు బత్తుల పద్మావతి సూచించారు. మండల కేంద్రమైన యడ్లపాడు-2 గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో వై హనుమారెడ్డి, సీడీపీవో జి.శాంతకుమారితో కలిసి శనివారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. సచివాలయాల నుంచి బాలల రక్షణ, బాల్య వివాహాల నిర్మూలనపై చేస్తున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ బాల్య వివాహాలకు నిరక్షరాస్యతతో పాటు లింగవివక్ష ప్రధాన కారణమన్నారు. వీటిని అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బాల్య వివాహాల కారణంగా కలిగే అనర్థాలపై గ్రామీణ ప్రాంత ప్రజలకు చైతన్యం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చదివే వయసులో బలవంతంగా జరిగే ఈ వివాహాల కారణంగా బాలికల పలు అనారోగ్యాలకు గురవుతారన్నారు. వారికి పుట్టే బిడ్డలు కూడా మానసిక, శారీరక పరిపక్వత ఉండదని వివరించారు. తద్వారా వారి బంగారు భవిష్యత్‌ను అంధకారంగా మార్చుతున్నారన్న విషయాన్ని బాలిక తల్లిదండ్రులు, సంరక్షకులే గ్రహించాలన్నారు. బాల్య వివాహాలు చేసేవారిపై అధికారులు కఠినంగా వ్యవహరించి, అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. ఇందుకోసం ఐసీడీఎస్, విద్య, పోలీసు, గ్రామ సచివాలయం సిబ్బంది, పంచాయతీ అధికారులు సమిష్టిగా బాల్య వివాహాల్ని గుర్తించి వెంటనే ఉన్నతాధికారుల సహకారంతో అడ్డుకోవాలన్నారు. బాల్య వివాహాల నిరోధం, వారి హక్కుల సంరక్షణపై ర్యాలీలు, అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి సచివాలయంలోనూ చైల్డ్‌లైన్లకు సంబంధించిన ఆయా అధికారుల సెల్‌నంబర్లను పోస్టర్లపై ప్రదర్శిన చేయాలన్నారు. వీటిపై ఎంపీడీవో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. అక్రమ బాలల తరలింపుపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. బాలల రక్షణ, సంరక్షణ, హక్కుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అంతటా చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు ఏర్పాటు చేసిందన్నారు. బాలల హక్కుల పరిరక్షణలతో దేశంలోనే ఏపీ ఐదోస్థానంలో నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీవో బి.నిర్మలారాణి తదితరులు ఉన్నారు. పంచాయతీ కార్యదర్శి శశికళ ఉన్నారు.

వినాయకా.. సెలవిక!

- వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు
- విగ్రహాల ఊరేగింపులో యువకుల కోలాహలం
- మారుమోగిన జై గణేష్ మహరాజ్‌కి నినాదం
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- ఘనంగా గణనాథుల విగ్రహాల నిమజ్జనం



పట్టణంలోని వినాయక మండపంలో పూజలో మంత్రి అంబటి రాంబాబు



కోటమ్మ సత్రం వద్ద మంత్రి అంబటి రాంబాబుకు జ్ఞాపిక అందిస్తున్న నిర్వాహకులు



పట్టణంలోని కోటమ్మ సత్రం వద్ద నుంచి శివుని రథం

సత్తెనపల్లి: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణం, మండలంలో ఏర్పాటు చేసిన మండపాల్లో కొలువుతీరిన వినాయక విగ్రహాలను శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా వినాయకుని చవితి ఉత్సవాల్లో భాగంగా మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక విగ్రహాల వద్ద ఏర్పాటు చేసిన లడ్డు ప్రసాదాలను దక్కించుకునేందుకు వేలంపాటలో భక్తులు పోటీపడ్డారు. పట్టణం లోని పలు వార్డులలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను రాష్ట్ర జల వనరుల శాఖామంత్రి అంబటి రాంబాబు సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. వినాయక మండపాల నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా రానున్న ఏడాది అంతా రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. మంత్రి అంబటి రాంబాబును నిర్వాహకులు పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. సత్తెనపల్లి మండలంలోని పలు గ్రామాల్లో కూడా ఆయన సందర్శించారు. ధూళిపాళ్లలో జరిగిన అన్నసంతర్పణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, నాయకులు చల్లంచర్ల సాంబశివ రావు, రాయపాటి పురుషోత్తమరావు, కళ్ళం విజయ భాస్కరరెడ్డి, అచ్యుత శివప్రసాద్, నల్లబోతు శివ నారాయణ, చిలుకా జయపాల్, తోట లక్ష్మీనారాయణ, సదనం హరి, గంటా ఏసుబాబు, కొత్తా రామకృష్ణ, దేవతి సుబ్బారావు, నందిగం ఆదాం, మండపాల నిర్వాహకులు, తదితరులు ఉన్నారు.

భారీగా లడ్డూ వేలం పాటలు..

పట్టణంలోని అచ్చంపేట రోడ్డులోని కోటమ్మ సత్రం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ మండపంలో లడ్డూను రూ.3.11లక్షలకు శికాకొలను సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి దక్కించుకున్నారు. కట్టమూరివారివీధిలోని రామాలయం వద్ద వినాయక మండపంలోని లడ్డును రూ.1.55 లక్షలకు లైటింగ్ రాజ,కృష్ణ వేలంలో దక్కించుకున్నారు. గుండెపూడివారి వీధిలో వినాయకుని మండపంలోని వినాయకుడి లడ్డు రూ.1,03 లక్షలకు పమిడిబల్ల కోటేశ్వరరావు దక్కించుకున్నాడు. గాంధీచౌక్ వద్ద వినాయక మండపంలో 50 కిలోల లడ్డును కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పొట్టి రాజేశ్వరరావు రూ.76,000కు దక్కించు కున్నాడు. గోళ్ళమూడివారి వీధిలో వినాయక నిమజ్జనం సందర్భంగా కొలాట ప్రదర్శన నిర్వహించారు. అలాగే పట్టణంలోని రఘురామ్ నగర్ లో గల పృథ్వీ గార్డీనియా అపార్ట్‌మెంట్‌లో కమిటీ ప్రెసిడెంట్ చల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తొమ్మిది కిలోల వినాయకుని లడ్డును పెరుమాళ్ళ లక్ష్మణ్ రూ.21,500కు దక్కించుకు న్నాడు. అనంతరం లడ్డును పెరుమాళ్ళ లక్ష్మణ్ శిరస్సుపై పెట్టి మేళతాళాలతో ఇంటి వరకు ఊరేగింపు నిర్వహించారు. పలు మండపాల వద్ద లక్కీడీపలు నిర్వహించి విజేతలకు బహుమతు లు అందించారు.

వైభవంగా నిమజ్జనోత్సవాలు



పట్టణంలోని పృథ్వీ గార్డీనియా నుంచి నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు



గ్రామోత్సవంలో గణనాథుడు

అచ్చంపేట: చామర్రులోని కృష్ణానదిలో వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవం శనివారం ఘనంగా జరిగింది. స్వామివారికి గ్రామోత్సవాలు నిర్వహించారు. చిగురుపాడు, అచ్చంపేట, రోకటిగుంటవారిపాలెం గ్రామాల నుంచి వినాయకుని విగ్రహాలు తరలివచ్చాయి.

బస్సు ఢీకొని విద్యార్థిని మృతి



మృతి చెందిన షేక్ వాజీదా (ఫైల్)

చిలకలూరిపేట టౌన్: రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని సుబ్బయ్యతోటకు చెందిన షేక్ అబ్దుల్ రషీద్ లారీ స్ప్రైర్ షాపు నడుపుతుంటాడు. ఇతనికి ఇద్దరు కుమార్తెలు. రెండో కుమార్తె షేక్ వాజీదా(18) గుంటూరు సమీపంలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతుంది. శనివారం తండ్రితో కలసి ద్విచక్రవాహనంపై అడ్డరోడ్డు సెంటర్ చేరుకుంది. ఈ క్రమంలో ఒంగోలు నుంచి గుంటూరు వైపు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు అడ్డరోడ్డు సెంటర్‌లో దూసుకువచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో పాటు అక్కడే బస్సుల కోసం వేచి ఉన్న విద్యార్థులపైకి దూసుకు రావడంతో గుంటూరులో ఇంటర్మీడియట్ చదువుతున్న కట్టా కృష్ణ, ఏసు కుమార్ సింగ్ అనే వ్యక్తి గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన కృష్ణను గుంటూరును ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన షేక్ వాజీదాను పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. తండ్రి అబ్దుల్ రషీద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

నరసరావుపేట టౌన్: అనారోగ్య సమస్యలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం పట్టణంలో చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శావల్యాపురం మండలం పోట్లూరు గ్రామానికి చెందిన నాదెండ్ల హనుమంతరావు (37) శుక్రవారం నిమ్మతోటలోని అత్తగారింటికి వచ్చాడు. నాగుర్‌వలీ ట్యాకీస్ వద్ద ఉన్న ఓవర్‌బ్రిడ్జి పైకి ఎక్కి పురుగుమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడిని 108 సహాయంతో వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య మహాలక్ష్మీతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ వీరేంద్రబాబు తెలిపారు.

గోవా మద్యం స్వాధీనం

ఈపూరు : రొంపిచర్ల మండలం బుచ్చిపాపన్నవారిపాలెంలో 768 గోవా మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు అడిషనల్ ఎస్పీ రాఘవేంద్రరావు శనివారం తెలిపారు. సమాచారం మేరకు ఈపూరు ఎస్ఈబీ ఎస్ఐ వీరవల్లి సైమన్ తన సిబ్బందితో దాడులు చేయగా 52 కేసుల 750 ఎంఎల్ హనీ గ్రేడ్ బ్రాందీ, 2 కేసుల రాయల్ క్లాసిక్ మాల్ట్ విస్కీ, ఒక కేసు మెన్షన్ హౌస్ ఫ్రెంచ్ బ్రాందీ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బుచ్చిపాపన్నవారిపాలెంకు చెందిన చల్లా వెంకటసాయి, ముత్తనపల్లికి చెందిన గోరంట్ల లక్ష్మీనారాయణ, తంగెడుమల్లి గ్రామానికి చెందిన అద్దంకి విజయ్‌కుమార్, బాపట్ల జిల్లా జానకవరంకు చెందిన కొండేపి రాములు గోవా మద్యం తీసుకొచ్చి విక్రయిస్తున్నారని అడిషనల్ ఎస్పీ తెలిపారు. మొత్తం 768 బాటిళ్లను స్వాధీనం చేసుకొని నలుగురిని అరెస్ట్ చేశామని, వీరిని కోర్టుకు హాజరుపరచనున్నట్లు అడిషనల్ ఎస్పీ పేర్కొన్నారు. ఈపూరు సెబ్ పోలీసులను అడిషనల్ ఎస్పీ అభినందించారు.